క్లుప్తంగా

విక్రయానికి సిద్ధంగా గణనాథుని ప్రతిమలు



సింగిడిలో విక్రయాలకు సిద్ధం చేసిన గణనాథుని విగ్రహాలు

భామిని: రంగురంగుల వినాయక ప్రతిమలు అమ్మకానికి సిద్ధమవుతున్నాయి. వ్యాపారులు విగ్రహాలను వాహనాలపై మండలానికి తీసుకువచ్చి విక్రయాలకు సిద్ధం చేస్తున్నారు. బత్తిలి, గురండి, సింగిడి, భామిని, బాలేరు కూడళ్ల వద్ద గణనాథుని ప్రతిమలు విక్రయానికి ఉంచారు. వర్షాలకు విగ్రహాలు తడిచిపోకుండా వాటిపై పాలిథిన్ కవర్లు కప్పిఉంచారు. మరోవైపు పర్యావరణ హితమైన మట్టి గణపయ్యల విగ్రహాలను స్థానికంగా కొందరు తయారు చేస్తున్నారు.

వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

వీరఘట్టం: వచ్చేనెల 7న జరగనున్న వినాయక ఉత్సవాలకు నిర్వాహకులు తప్పకుండా అనుమతి తీసుకోవాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో గణేష్ మహోత్సవాలను జరుపుకోవాలన్నారు. ఉత్సవ కమిటీలు వారి పేర్లు, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు, రాత్రి పూట విగ్రహాల వద్ద ఎవరు ఉంటారు, ఏ రోజున ఎక్కడ విగ్రహాలను నిమజ్జనం చేస్తారు తదితర వివరాలు తెలియజేయాలని కోరారు. అలాగే సచివాలయం లేదా మీ–సేవా కేంద్రాల్లో ఉత్సవాల అనుమతి కోసం దరఖాస్తు చేసి చలానాతో పాటు ఉత్సవ కమిటీ వివరాలను సబ్ డివిజనల్ వారి కార్యాలయానికి అందజేయాలని కోరారు.

అలరించిన శ్రీకృష్ణ కథా గానం



శ్రీకృష్ణ కథా గానం చేస్తున్న డాక్టర్ సమీర్ నందన్ బృందం

పాలకొండ రూరల్: సత్యసాయి చూపిన ప్రేమ మార్గం అనుసరణీయమని సత్యసాయి సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. ఆదివారం ఏర్పాటుచేసిన ఆధ్యాత్మిక సత్సంఘంలో భాగంగా శ్రీక్రిష్ణ కథా గానం కార్యక్రమాన్ని డాక్టర్ సమీర్ నందన్ వారి బృందం చేపట్టింది. శ్రీకృష్ణుడి జననం నుంచి ఆయన చూపిన మహిమలు, కర్తవ్య బోధ తదితర అంశాలను బృంద సభ్యులు ఆలపించారు. ఆద్యాంతం ఈ కథా గానం శ్రోతలను, భక్తులను ఆకట్టుకుంది.

హెల్మెట్ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ జగదీష్‌నాయుడు

సీతంపేట: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ జగదీష్‌నాయుడు అన్నారు. స్థానిక అడ్వంచర్ పార్కు వద్ద యువతకు రోడ్డు ప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. మైనర్లు డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు.

వరుణుడి కరుణతో వరినాట్లు



దిమ్మిడిజోల వద్ద పొలాల్లో చేరిన వర్షపునీరు

భామిని: మండలంలో గత వారం రోజులుగా కురిసిన వర్షాలతో పంటపొలాల్లో నీరు చేరింది. దీంతో ఇన్నాళ్లు నీరు లేక దమ్ములు, వరినాట్లు పూర్తిచేయని రైతులు నాట్లు పూర్తిచేసేందుకు సమాయత్తమయ్యారు. అనంతగిరి, గజపతినగరం, దిమ్మిడిజోల, సొలికిరి ప్రాంతాల్లో ఆదివారం రైతులు నారుతీస్తూ, నాట్లు వేస్తూ కనిపించారు.

నీట మునిగిన పంటపొలాలు



రాజచెరువు సమీపంలో నీట మునిగిన పంటపొలాలు

వీరఘట్టం: ఇటీవల కురిసిన వర్షాలకు వీరఘట్టం సమీపంలో ఉన్న రాజచెరువుకు వరద నీరు పోటెత్తింది. దీంతో సమీపంలో ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. నాలుగు రోజులుగా వరినాట్లు నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు ఇంకా పంటపొలాల్లో ఉండడంతో వరినాట్లు పాడైపోతున్నాయని అంటున్నారు. అధికారులు పంటపొలాలను పరిశీలించి పంటనష్టాన్ని అంచనా వేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సెక్యూరిటీ పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద సెక్యూరిటీ పెంచాల్సి ఉంది. రాత్రి సమయాల్లో పేషెంట్లతో పాటు గుంపులుగా సహాయకులు వస్తున్నారు. అలాంటి సమయాల్లో ఇబ్బందులు పడుతున్నాం. ప్రతీ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకుల కోసం వెయిటింగ్ హాల్స్ ఏర్పాటు చేయాలి. అవసరమైన వారిని మాత్రమే పేషెంటుతో అనుమతించాలి. ఎమర్జెన్సీ వార్డుల్లోకి అనుమతి లేకుండా ఎవరూ రాకుండా ఉండేలా సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. – **డాక్టర్ పైల భాగ్యశ్రీ, సర్జన్, ఏరియా ఆస్పత్రి, పాలకొండ**



దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచార ఘటన చాలా దారుణం. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి. సమాజంలో అలాంటి మృగాల నుంచి మహిళా వైద్యులను రక్షించేలా డాక్టర్లకు రక్షణ కల్పించేలా చట్టాన్ని తీసుకువచ్చి పక్కాగా అమలు చేయాలి. రాత్రీపగలు మహిళా వైద్యులకు సెక్యూరిటీగా పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటూ రక్షణ కల్పించాలి. – **డాక్టర్ పి.ఉమామహేశ్వరి, మెడికల్ ఆఫీసర్, వీరఘట్టం**

సబ్‌కలెక్టర్‌గా యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ రూరల్: ప్రొహిబిషన్ పూర్తి చేసిన 2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సి.యశ్వంత్ కుమార్ రెడ్డిని పాలకొండ సబ్‌డివిజన్ సబ్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఈ మేరకు సీఎంఓ కార్యాలయం నుంచి ఆదివారం రాత్రి ఉత్తర్వులు వెలువడినట్లు స్థానిక ఆర్డీఓ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

గాలికుంటుకు టీకాతో చెక్

- పాడిపశువుల ఆరోగ్యంపై పశువైద్యశాఖ ప్రత్యేక దృష్టి
- ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు ఉచితంగా టీకాలు



పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: పాడిపశువుల ఆరోగ్య సంరక్షణపై పశువైద్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై పాడిరైతులకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధుల నివారణకు ముందస్తుగా టీకాలు వేస్తోంది. ఈ సీజన్‌లో పశువులకు ప్రమాదకరమైన వ్యాధి గాలికుంటుకు. వైరస్ వల్ల సోకే ఈ వ్యాధి గాలి ద్వారా పశువులకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి సోకిన పశువుల పాలు తాగడం ద్వారా దూడలకు సోకుతుంది. గాలికుంటు వ్యాధి నివారణకు పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి వచ్చే నెల 18 వరకు ఉచితంగా టీకాలు వేస్తోంది.

గాలికుంటు వ్యాధిపై అప్రమత్తం

గాలికుంటువ్యాధి సోకిన ఆవులు, ఎద్దులు, గేదెల శరీర ఉష్ణోగ్రత 104 నుంచి 105 డిగ్రీలకు పెరుగుతుంది. పశువుల నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. ఆహారం సరిగా తీసుకోలేవు. నీరసంగా మారి నడిచేందుకు ఇబ్బంది పడతాయి. వ్యాధి నివారణ కోసం వైద్యుల సూచన మేరకు యాంటీబయాటిక్స్, పెయిన్ కిల్లర్స్ వంటి మందులను వాడాల్సి ఉంటుంది.

వ్యాధి వ్యాప్తి

ఈ వ్యాధి కలిగించే వైరస్ పశువుల పేడ, పారుడు, వీర్యము, పాలు, పుండ్లు ద్వారా విసర్జింపబడి వేరొక పశువుకు నీటి ద్వారా, గాలి ద్వారా, మేత ద్వారా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు

- ఇంక్యుబేషన్ కాలం 2 నుంచి 6 రోజులు. వ్యాధికి గురయ్యే శాతం 1–2 శాతం ఉంటుంది.
- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు ఫారన్‌హీట్ ఉంటుంది.
- పశువు మేత మేయదు. నెమరువేయదు. నోటిలో బొబ్బలు పగిలి చొంగ కారుతుంటుంది.
- కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి పశువులు కుంటుతూ నడుస్తాయి.
- పనిచేసే పశువుల్లో శక్తి నశిస్తుంది.
- పాలిచ్చే పశువుల రొమ్ములపైన, పొదుగులపైన బొబ్బలు ఏర్పడి పొదుగు వాపు వస్తుంది.
- పాడిపశువులలో గర్భధారణ శక్తి కోల్పోతాయి.
- మేకలు, గొర్రెలు, పందుల్లోనూ గాలికుంటు వ్యాధి వస్తుంది.

నివారణ చర్యలు

- వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి.
- పశువుల శాలను పరిశుభ్రంగా ఉంచాలి.
- పక్క గ్రామాల్లో వ్యాధి ఉన్నప్పుడు పశువులను సంతలకు, జాతరలకు వెళ్లనివ్వరాదు.
- ఆరోగ్యంగా ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకా మొదటి సారి 2 నెలల వయసులో వేయించాలి. నెల తరువాత బూస్టర్ డోసు వేయించాలి. ఆ తరువాత ప్రతి ఏటా క్రమం తప్పకుండా టీకా వేయించాలి.
- టీకా మందు మోతాదు 2 ఎంఎల్ ఇవ్వాలి.
- టీకా వేసిన తరువాత 1 నుంచి 3 వారాల్లో పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది.
- పాడి పశువులకు ఈనిన తరువాత టీకా వేయించాలి.
- కలుషితమైన పశువుల దాణా, మేతలను కాల్చివేయాలి.
- పాలను బాగా వేడి చేసిన తరువాత తాగడానికి వినియోగించాలి.
- పశువుల కళేబరాన్ని లోతైన గొయ్యి తీసి అందులో సున్నం వేసి పాతిపెట్టాలి. లేదా కాల్చివేయాలి.

టీకాలు వేయించాలి



పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు పశుసంవర్ధక శాఖ జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామాల్లో పాడిరైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలకు తప్పకుండా గాలికుంటు టీకా వేయించాలి. పశువులకు ఈ వ్యాధి సోకితే రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ నెల 20 నుంచి సెప్టెంబర్ 18 వరకు ఉచితంగా టీకాలు వేయడం జరుగుతోంది. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు టీకాలు వేయించాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – **ఎస్.సురేష్‌కుమార్, మండల పశుసంవర్ధక శాఖాధికారి, గరుగుబిల్లి**

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



రోగులను తనిఖీలు చేస్తున్న వైద్యులు

గరుగుబిల్లి: ప్రజలు సేవాగుణం కలిగి ఉండాలని, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలని జిల్లా కలెక్టరు ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. తోటపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద మనోబంధు ఆధ్వర్యంలో తోటపల్లి టెంపుల్స్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య శిబిరాల ద్వారా మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో మరిన్ని వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి దిట్టకవి చక్రపాణి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారందరికీ మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో మనోబంధు వ్యవస్థాపక ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణరాజు, జట్టు ఆశ్రమ వ్యవస్థాపకులు డా.పారినాయుడు, వైద్యులు వాడ్రేవు శ్రీనగేష్, రామానంద సత్పతి, సుప్రియా సత్పతి, బోగి ఈశ్వరరావు, యాళ్ల వివేక్, వై.పద్మజ, జి.ప్రభాకర్, పి.భాస్కరనాయుడు, ఎస్.ప్రతాప్‌కుమార్, పి.రాజేష్, జి.శ్రావణ్‌కుమార్, డి.శకుంతల, ఎం.ఉపేంద్ర శ్రీనివాస్, చుక్క హేమప్రసాద్ పాల్గొన్నారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడాలి

మహిళా సంఘ సభ్యులు ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే జగదీశ్వరీ అన్నారు. మండలంలోని తోటపల్లిలో ఆదివారం నిర్వహించిన 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని 276 ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులకు స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ బ్యాంకు లింకేజీ రుణాల క్రింద రూ.12.24 కోట్లు నమూనా చెక్కును ఆమె అందజేశారు. రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం పి.అప్పలనాయుడు, ఎంపీటీసీ ఎం.సింహాచలంనాయుడు తదితరులున్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తే ప్రయోజనం



బీజామృతంతో శ్రీరాగి నారు శుద్ధి చేస్తున్న రైతులు

గుమ్మలక్ష్మీపురం: చిరుధాన్యాల పంటల సాగులో ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఏపీసీఎన్ఎఫ్ గుమ్మలక్ష్మీపురం క్లస్టర్ కోఆర్డినేటర్ కిమిడి భూషణరావు అన్నారు. మండలంలోని చెముడుగూడ పంచాయతీ తంబంగూడ గ్రామంలో శ్రీరాగి(చోడి) నారును ఆదివారం పరిశీలించారు. బీజామృతంతో నారును ఎలా శుద్ధి చేయాలో రైతులకు వివరించారు. అనంతరం వరుస క్రమంలో నాట్లు వేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బీజామృతంతో నారు శుద్ధి చేయడం వల్ల మొక్క వేళ్లలో ఉండే తెగుళ్లు, చిన్న చిన్న పురుగులు నశిస్తాయన్నారు.

శ్రీవరి బలవర్ధకమైన ఆహారం కనుక, ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించి సాగు చేయడం వల్ల పంటకు మార్కెట్లో మరింత డిమాండ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పద్మ తదితరులున్నారు.

మానసిక దివ్యాంగులకు అండగా మనోబంధు

గుమ్మలక్ష్మీపురం: విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న మనోబంధు ఫౌండేషన్ రోడ్లపై తిరుగుతున్న మానసిక దివ్యాంగులకు సేవలందిస్తుందోని ఫౌండేషన్ వ్యవస్థాపకులు బి.రామకృష్ణంరాజు తెలిపారు. ఆదివారం గుమ్మలక్ష్మీపురం వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గ్రామాలు, పట్టణాల్లో మానసిక దివ్యాంగులు కనబడితే తమ సంస్థ దృష్టికి తీసుకురావాలని కోరారు. అటువంటి వారికి ప్రభుత్వ మానసిక కేంద్రాల్లో చికిత్స అందించి వారి అడ్రస్సు తెలుసుకొని వారి వారి స్వస్థలాలకు/కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు సుమారు 300 మంది మానసిక దివ్యాంగులకు చికిత్స అందించి, వారి కుటుంబ సభ్యుల వద్దకు చేర్చడం జరిగిందన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ చక్రపాణి, అజయ్ కల్లాం, మాజీ డీజీపీ ఆంజనేయ రెడ్డి తదితరులు ఈ సంస్థలో డైరెక్టర్లుగా కొనసాగుతున్నారని, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మనోబంధు సేవలందిస్తోందని తెలిపారు. మానసిక దివ్యాంగులు కనిపిస్తే 9866887299 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నూతన కమిటీ ఏర్పాటు



కమిటీ సభ్యులను సన్మానిస్తున్న కబడ్డీ క్రీడాకారులు

పాలకొండ రూరల్: క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కోడి సుదర్శనరావు అన్నారు. రాష్ట్ర కమిటీ నేతృత్వంలో ఆదివారం పాలకొండలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా పల్లా కొండలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా సీనియర్ క్రీడాకారుడు వెన్నపు చంద్రశేఖర్‌తో పాటు పలువురు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని జిల్లా పరిధిలోని జూనియర్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు ఘనంగా సన్మానించారు.

హిందువులపై దాడులు తగవు



ర్యాలీ చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

పాలకొండ రూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణహోమం సృష్టించి బలి తీసుకోవటం ఘోరమని, కలకత్తాలో ట్రైనీ వైద్యురాలి హత్య దుర్మార్గపు చర్య అని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. ఈ ఘటనలను నిరసిస్తూ ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో ఆదివారం పాలకొండలో భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నగరపంచాయతీ పాలకవర్గ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సంఘాల సభ్యులతోపాటు స్థానిక యువత, హిందూవాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్సార్ కూడలి నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారంగా ఏర్పడి 'సేవ్ హిందూస్.. సేవ్ గరల్స్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెలమల మన్మథరావు, కడగల వెంకటరమణ, తుమ్మ గుంట శంకరారవు, బాసూరు కాంతారావు, కోడెం బాబి, ఆర్ఎస్ఎస్ సభ్యులు శాసపు రాంబాబు, దుప్పడ వెంకటరమణ, పైల రవికుమార్, వడాన కూర్మారావు, ఊన్న పెద్దబాబు, వైకుంఠరావు, యోగేశ్వరరావు తదితరులున్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



రెల్లివీధిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు

పాలకొండ/పాలకొండ రూరల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ పడకేసింది. జనావాసాల మధ్య, వీధి కూడళ్ల వద్ద రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోతున్నా సంబంధిత అధికారులు తొలగించే ప్రయత్నం చేయడం లేదు. వ్యర్థాల కారణంగా దోమలు విజృంభించి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. డంపింగ్ యార్డు లేకపోవటంతో పట్టణంలో 20 వార్డుల్లో సేకరించిన చెత్తను నగరపంచాయతీ కార్యాలయం వద్దనే డంపు చేయటంతో అక్కడకు సమీపంలో ఉన్న ప్రధాన మార్కెట్‌కు వచ్చేవారు, శాఖా గ్రంథాలయానికి వచ్చేవారు అధికారుల తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. శివారు వీధుల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. రెల్లివీధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద చెత్తపోగులు పేరుకుపోయాయి. జ్వరాలు విజృంభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్టు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాటిశీల గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బీ(టీజీ) రోడ్డు పక్కన ఓ చెట్టు పూర్తిగా ఎండిపోయి కూలేందుకు సిద్ధంగా ఉంది. వర్షాలకు చెట్టు కొమ్మలు విరిగిపడుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ఈ చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాలు నిర్దేశించుకోవాలి



హౌసింగ్ ఏఈని సన్మానిస్తున్న సత్యసాయి విద్యాసంస్థల నిర్వాహకులు

పాలకొండ రూరల్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని జియమ్మవలస గృహ నిర్మాణశాఖ ఏఈ లావేటి మహేష్ అన్నారు. స్థానిక సత్యసాయి విద్యాసంస్థల్లో ఆదివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవగాం గ్రామానికి చెందిన తాను ఇదే పాఠశాలలో చదువుకున్నానని, ఇప్పుడు ఇదే పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా విద్యసంస్థల నిర్వాహకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, సహాపాధ్యాయులు, విద్యార్థులు మహేష్‌ను సన్మానించారు.

భయపెడుతున్న వీధి కుక్కలు



కురుపాంలో హల్‌చల్ చేస్తున్న వీధికుక్కలు

గుమ్మలక్ష్మీపురం: ఇటీవల అన్ని గ్రామాల్లో వీధి కుక్కల బెడద పెరిగిపోయింది. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ దారినపోయే వారిపై దాడులకు పాల్పడుతున్నాయి. ద్విచక్ర వాహనదారులను వెంబడిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వీధి కుక్కల దాటికి జనాలు ఒంటరిగా వీధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. శునకాల నియంత్రణకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

పార్వతీపురం టౌన్: సీతానగరం – పార్వతీపురం రైల్వేస్టేషన్ల మధ్యలో ఓ వ్యక్తి రైలు నుంచి జారి పడడంతో తీవ్రగాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. జీఆర్పీ పోలీసుల వివరాల మేరకు.. ఒడిశాలోని కలహండి సమీపంలో అమురలపదరకు చెందిన ఎన్. చందన్ 'పూరీ–అహ్మదాబాద్' రైలులో ప్రయాణిస్తూ తలుపు వద్ద కూర్చున్నాడు. సరిగ్గా సీతానగరం – పార్వతీపురం మధ్య జారి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రైల్వే పోలీసులు స్పందించి క్షతగాత్రుడ్ని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. హెచ్‌సీ రత్నకుమార్ కేసు నమోదు చేశారు.

హమ్మయ్యా..



గురండి ఏబీ రోడ్డులో నిలిచిన భారీ వాహనం

భామిని: మండలంలో నులకలజోడు– బిల్లుమడ మధ్య ఏబీరోడ్డు గుంతల్లో భారీ లారీలు దిగబడటంతో వారం రోజులుగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో బత్తిలి వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు పసుకుడి నుంచి వెనుదిరిగేవి. బత్తిలి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. నాలుగు రోజులుగా పసుకుడి వద్దకు నిలిచిపోయిన 124 టైర్ల భారీ లారీ వెళ్లేందుకు వీలుగా ఏబీరోడ్డులో గుంతలను తాత్కాళికంగా పూడ్చడంతో మిగతా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కాస్త తొలగాయి. ఆర్టీసీ బస్సు బత్తిలి వరకు వెళ్తుండడంతో ప్రయాణికులకు ఊరట లభించింది.

ప్రతీ మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యం



మహిళలకు రూ.1.36 కోట్ల నమూనా చెక్ అందజేస్తున్న వెలుగు అధికారులు

వీరఘట్టం: ప్రధాన మంత్రి నరేంద్రమోడి ప్రారంభించిన 'లక్‌పతి దీదీ' ప్రోగ్రాం ద్వారా ప్రతీ మహిళను లక్షాధికారిని చేయడమే లక్ష్యమని ఎం.ఎం.ఎస్ అధ్యక్షురాలు పి.సుజాత అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో లక్‌పతి దీదీ పథకం లక్ష్యాలను మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. ఈ పథకం ద్వారా మండలంలోని 74 డ్వాక్రా సంఘాలకు చెందిన 786 మంది మహిళలకు రూ.1.36 కోట్లు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఏపీఓ జి.శివున్నాయుడు, కె.లలితకుమారి, పలువురు టీడీపీ నాయకులు జామి లక్ష్మీనారాయణ, ఉదయ్‌భాస్కర్, బల్లా హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



జియ్యమ్మవలస: మృతురాలు భర్త పరంధామును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

జియ్యమ్మవలస: మండలంలోని బట్లబద్ర గ్రామానికి చెందిన తల్లి, కుమార్తె మేరువ దుర్గ, మేరువ చైతన్య డెంగీతో మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆదివారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతురాలి భర్త మేరువ పరంధామకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో డెంగీ, విషజ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఈ తల్లీకూతుళ్ల మృతే నిదర్శనమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి సీజన్‌లో ఫీవర్ సర్వే చేయడంతో పాటు వ్యాధులు విజృంభించకుండా ముందస్తు చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, నాయకులు లోలుగు నారాయణరావు, బలగ వెంకటరమణ, సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.

భామినిలో..



భామిని: మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వివిధ పార్టీల నాయకులు

భామిని: మండలంలోని తాలాడ గ్రామానికి చెందిన వలరౌతు నిరంజన్(49) శనివారం వంశధార నదిలో ప్రమాదవశాత్తు మునిగిపోయి మరణించిన విషయం విధితమే. మృతుని కుటుంబ సభ్యులను మండలంలోని వివిధ పార్టీల నాయకులు, కేజీబీవీ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆదివారం పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పీఆర్టీయూ అధ్యక్షుడు వలరౌతు శ్రీరాములు, వీఆర్వో వలరౌతు రవికుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కిల్లారి ఫాల్గుణరావు, మాజీ సర్పంచ్ వి.మన్మథరావు, వి.పాపినాయుడు, తదితరులు ఉన్నారు. మృతుని భార్య శారద భామిని కేజీబీవీ ఎస్ఓగా పనిచేస్తున్నారు. మృతుని తల్లి సర్పంచ్‌గా సేవలందిస్తున్నారు.